

నంద్యాలలో మెడికల్ మాఫియా

- విచ్చలవిడిగా మందుల దుకాణాలు
- ఫార్మాసిస్టు ఉండరు... బీ ఫార్మసీ సర్టిఫికెట్ ఉండదు
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఇవ్వకుండానే మందుల పంపిణీ
- కాలం చెల్లిన మందుల అమ్మకాలు

నంద్యాల హాస్పిటల్, మే 26 (ఆంధ్రజ్యోతి) : నంద్యాలలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. విచ్చలవిడిగా ఔషధ దుకాణాలు నిర్వహిస్తూ కష్టమర్ల జేబులకు చిల్లు పెడుతున్నారు. మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్టులు లేకుండానే మందుల అమ్మకాలు చేస్తున్నారు. అడ్డదారిన అనుమతులు పొందుతూ ఇష్టానుసారంగా మెడికల్ దందాను నిర్వహిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. లైసెన్స్ ఒకరి పేరుతో ఉంటే సంబంధం లేని వ్యక్తి దుకాణానికి యజమానిగా ఉంటూ మందులను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఔషధ నియంత్రణ విభాగం అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మెడికల్ షాపులో బీ ఫార్మసీ పూర్తి చేసిన వారు లేకపోవడంతో చాలామంది కోర్సు చేసిన వారి సర్టిఫికెట్లను అద్దెకు తెచ్చుకుని లైసెన్స్ దక్కించుకుని మరీ మెడికల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ డాక్టర్ ఇచ్చిన మందుల చీటి ఆధారంగా మందులు పంపిణీ చేయడంతో పాటు ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా అటు ప్రభుత్వానికి ఇటు వినియోగదారునికి నష్టం చేకూరుస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ నంద్యాలలో మెడికల్ మాఫియాదే ఇష్టారాజ్యమైంది. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

అనర్హులు మెడికల్ షాపులను నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా అమ్మకాలు సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నంద్యాల మెడికల్ షాపుల్లో చాలా వాటికి ఫార్మాసిస్టు, ఫార్మసీ రిజిస్ట్రేషన్ లేకుండానే కొనసాగుతున్నాయి. ఒకవేళ సర్టిఫికెట్ ఉన్నా ఫార్మాసిస్టు దగ్గర కొనుగోలు చేసి అధికారులకు చూపిస్తున్నారు. సర్టిఫికెట్‌లో ఒక పేరు, మందుల దుకాణం నిర్వహించేది మరొకరు. ఇలా ధనార్జనే


గతంలో సీజ్ చేసిన మెడికల్ షాపులు (ఫైల్)

ధ్యేయంగా మందుల షాపుల దుకాణాదారులు నిర్వహిస్తున్నారు. నంద్యాల డివిజన్‌లో దాదాపు 500కు పైగా మందుల దుకాణాలు ఉండగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో 300కు పైగా మెడికల్ షాపులు ఉన్నాయి. ఈ దుకాణాల్లో చాలా మంది యజమానులు ప్రిస్క్రిప్షన్ లేకుండానే డాక్టర్ల మాదిరిగా సలహాలు ఇస్తూ అడ్డగోలుగా మందులు విక్రయిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నడుస్తున్న మెడికల్ షాపుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. వైద్యులు చెప్పిందే వేదంగా అవసరం లేకున్నా మందులు ఇస్తూ డబ్బులు దండుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాలం చెల్లిన మందులు, రద్దు అయిన మందులు పంపిణీ చేయకుండా ఆపరేషన్ గరుడ పేరుతో మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. నంద్యాల పట్టణంలో మెడికల్ మాఫియాపై అధికారులు కట్టడి చేస్తారా లేనిది చర్చనీయాంశంగా మారింది.


తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

విచ్చలవిడిగా కాలం చెల్లిన మందులు

నంద్యాల పట్టణంలో అనేక మందుల దుకాణాల్లో విచ్చలవిడిగా కాలం చెల్లిన మందులను రోగులకు అంటగడుతున్నారు. రోగుల అవసరాలను, వారి నిరక్ష్యరాశ్యతను ఆసరాగా చేసుకుని నిలువు దోపిడీ చేస్తున్నారు. నిత్యం తనిఖీ చేయాల్సిన అధికారులు, తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలం చెల్లిన మందులతో ప్రాణాపాయం ఉన్నా అమ్మకాలు జరగడంపై సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి. శుక్రవారం విజిలెన్స్ అధికారుల దాడుల్లో పట్టణంలోని 8 మెడికల్ షాపుల్లో దాడులు నిర్వహించగా కాలం చెల్లిన మందులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే అకౌంట్స్‌లో లేని మందులు కూడా విజిలెన్స్ అధికారులు గుర్తించారు.

ప్రతినెలా తనిఖీలు చేస్తున్నాం

నంద్యాల డివిజన్ పరిధిలో మందుల షాపులను ప్రతినెలా తనిఖీలు చేస్తున్నాము. మెడికల్ షాపులో ఫార్మాసిస్టు, బీ ఫార్మసీ సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నాము. రెన్యువల్ చేసుకోని మందుల షాపులపై నివేదికలు పంపుతున్నాము. అనధికారికంగా నిర్వహిస్తున్న మందుల షాపులపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే మందుల షాపులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాము. రద్దు చేసిన మందులను అమ్మితే చర్యలు తప్పవు.

- దాదాఖలందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, నంద్యాల

'పది' సప్లిమెంటరీ పరీక్షకు 503 మంది విద్యార్థులు గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో సోమవారం నిర్వహించిన పదో తరగతి సాంఘికశాస్త్రం సప్లిమెంటరీ పరీక్షకు 503 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. డీఈవో మాట్లాడుతూ 35 పరీక్ష కేంద్రాల్లో జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 1,599 మంది విద్యార్థులకు గానూ 1,096 మంది హాజరయ్యారని, 503 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 6 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని చెప్పారు.

ఏపీఈఏపీ సెట్‌కు 44 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ ప్రవేశాలకు సోమవారం నిర్వహించిన ఏపీఈఏపీ సెట్‌కు 44 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన మొదటి సెషన్‌లో 543 మంది విద్యార్థులకు గానూ 523 మంది హాజరుకాగా 20 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించిన రెండో సెషన్‌లో 541 మంది విద్యార్థులకు గానూ 517 మంది హాజరు కాగా 24 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్స్‌లో కలిపి 1,084 మంది విద్యార్థులకు గాను 1,040 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారు. 98.43శాతం హాజరు నమోదైంది.

వేరుశనగ ధర రూ.6,287

ఆదోని అగ్రికల్చర్, మే 26(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధర సోమవారం క్వింటా గరిష్ఠంగా రూ.6,287కు వ్యాపారులు కొనుగోలు చేశారు. గత వారంతో పోల్చితే వేరుశనగ ధర క్వింటాకు రూ.500 పతనమైంది. ఖరీఫ్ సీజన్ ఆరంభపు వేళలో జరగడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదోని మార్కెట్ యార్డుకు 122 వేరుశనగ బస్తాలు విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.5,689, గరిష్ఠ ధర రూ.6,287, సగటున రూ.6,232 పలికింది.

సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పీజీఆర్ఎస్‌కు 246దరఖాస్తులను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆమె మాట్లాడుతూ రీ ఓపెన్ అయిన 48 దరఖాస్తులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 1.374 ఫిర్యాదులకు సంబంధించి ఆడిట్‌ను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అర్జీదారుల అభిప్రాయ సేకరణకు ఇంకా 42.83శాతం పెండింగ్‌లో ఉన్న డేటాను సేకరించి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సర్వేలలో మనమిత్ర క్యాంపెయిన్‌లో ఇంకా 12,724పెండింగ్‌లో ఉన్నాయని, సిటిజన్ ఈకేవైసీ 2,23,024 మందికి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. చిల్డ్రన్ వితౌట్ ఆధార్ 6554, హౌసింగ్ ఇమేజి జియోకోర్డినేట్‌కు సంబంధించి 622 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న కలెక్టర్ రాజకుమారి

పసుపు పండుగ..!

- కడప గడ్డపై నేటి నుంచి 'మహా'సంబరం
- ఉమ్మడి కర్నూలు నుంచి వేలాదిగా తరలిన టీడీపీ శ్రేణులు

కర్నూలు, మే 26 (ఆంధ్రజ్యోతి): మహానాడు.. తెలుగుతమ్ముళ్ల మూడు రోజుల పండుగ. సామాన్యుల్లో రాజకీయ చైతన్యానికి నాంది పలుకుతూ.. తెలుగునాట ఆరాధ్య నటుడు నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. జనహృదయాల్లో చెరగని ముద్రవేసి తొమ్మిది నెలల్లోనే అఖండ విజయం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీపై పసుపు జెండాను ఎగురవేశారు. ఆనాటి నుంచి ప్రతియేటా ఎన్టీఆర్ జన్మదినం పురస్కరించుకుని 'మహానాడు' మూడు రోజుల పండుగను పసుపుదళం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వస్తుంది. 43వ మహానాడు పండుగను నేటి నుంచి కడప గడపపై ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేశారు. ఈ వేడుక నిర్వహణ కమిటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్‌లతో పాటు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలు ఉన్నారు. సోమవారం ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు కడపకు బయలు దేరారు. 28న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రతి నియోజకవర్గం నుంచి 5 వేల మందికి తగ్గకుండా కడపకు తరలివెళ్లారు.



మిగతా 4వ పేజీలో

వానలే.. వానలు

- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
- పూర్తిగా చల్లబడిన వాతావరణం
- జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యం 3.57 లక్షల హెక్టార్లు

ఖరీఫ్‌కు జూన్ రెండో వారంలో ప్రవేశించాల్సిన నైరుతి రుతుపవనాలు బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏర్పడిన అల్పపీడనాల కారణంగా శనివారమే కేరళను రుతుపవనాలు తాకాయి. రెండు రోజుల తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తే మరింత ముందుగానే ఆదివారం నుంచి మొదలయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శక్తి తుఫాన్ ఏర్పడిందని, దీని వల్ల ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వారం రోజుల పాటు వర్షాలు భారీగా కురుస్తాయనీ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో జోరువానలు ఆదివారంతో ప్రారంభమయ్యాయి. సోమవారం కూడా ఉదయం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.



కర్నూలు అగ్రికల్చర్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఖరీఫ్‌లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో రైతులు ప్రస్తుత వర్షాలకు పొలాలను దున్ని దుక్కి చేసుకోవడంతోపాటు విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. కర్నూలు నగరంలోని కొత్తబస్టాండు ప్రాంతంలో ఎరువులు, విత్తనాల కోసం ఫర్టిలైజర్స్ దుకాణాల ఎదుట రైతులు క్యూ కట్టారు. ముందస్తు వర్షాల వల్ల మే నెలాఖరులోనే విత్తనాలు విత్తుకునే అవకాశం ఏర్పడటంతో రైతులు ముందున్నారు. ముందస్తు పంటల సాగు వల్ల క్రిమికీటకాల బెడద ఉండదని, తక్కువ సమయంలోనే పంట ఉత్పత్తులు చేతికి వస్తాయని రైతులు ఆశపడుతున్నారు. నైరుతి రుతుపవనాలు మే నెలలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రవేశించడం పదహారు ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం.

ఆరున్నర లక్షల ఎకరాల్లో పంటల సాగు

జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణంపై వ్యవసాయ శాఖ యంత్రాంగం అంచనా వేసింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు ఆరున్నర లక్షల ఎకరాల్లో పంటలు సాగుతవున్నాయనీ కర్నూలు జిల్లా జేడీ వరలక్ష్మి, నంద్యాల జేడీ మురళీకృష్ణ అంచనా వేసి అవసరమయ్యే విత్తనాలు, ఎరువుల కోసం వ్యవసాయ శాఖ కమిషనర్‌కు నివేదికను పంపారు. ముఖ్యంగా పత్తి సాగు ఈసారి గత ఏడాది కంటే 20 శాతం ఎక్కువగా ఉంటుందని కమిషనర్‌కు పంపిన నివేదికలో పేర్కొన్నారు. దాదాపు ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు 2.60 లక్షల హెక్టార్లలో ఉంటుందని, రాష్ట్రంలో ఈ విస్తీర్ణంలో పత్తి కర్నూలు మొదటి స్థానం పొందే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మిగతా 4 వ పేజీలో

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

- నేటి నుంచి మూడు రోజుల పాటు వానలు
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం

నంద్యాల ఎడ్యుకేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు 16 సంవత్సరాల తర్వాత 8 రోజులు ముందుగానే కేరళ తీరాన్ని తాకిన తర్వాత తూర్పు, వాయివ్యదిశగా కదులుతూ సోమవారం రాయలసీమలోకి ప్రవేశించాయి. దీంతో కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల్లో పలు మండలాల్లో సోమవారం మోస్తరు వర్షాలు పడ్డాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. సోమవారం కర్నూలు జిల్లాలో 24.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా, నంద్యాల జిల్లాలో 26.6డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.



మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని, అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. మంగళవారం ఉరుములు, మెరుపులతో పాటు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, నంద్యాల జిల్లాలో 15.6ఎంఎం నుంచి 64.4 ఎంఎం వరకు మోస్తరు వర్షం నుంచి భారీ వర్షం పడే సూచనలున్నాయని, కర్నూలు జిల్లాలో 2.5 ఎంఎం నుంచి 15.5 ఎంఎం వరకు సాధారణ వర్షపాత నుంచి మోస్తరు వర్షాలు పడు అవకాశముందని వెల్లడించారు. 28న నంద్యాల, కర్నూలు జిల్లాలో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంగా గాలులు వీచే అవకాశముందని, రెండు జిల్లాలో 15.6 ఎంఎం నుంచి 64.4 ఎంఎం వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించారు. 29వ తేదీ ఉరుములు మెరుపులతో పాటు 50 నుంచి 60కిలోమీటర్ల వేగంగా గాలులు వీచే అవకాశముందని, ఉమ్మడి జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యే సూచనలున్నాయని వాతావరణ సంస్థ తమ నివేదికలో వెల్లడించింది.

నంద్యాల జిల్లాలో వర్షపాతం

శ్రీశైలం మండలంలో 35.2, పగిద్యాల 19.2, వెలుగోడు 19.2, నందికొట్కూరు 18.2, మిడ్తూరు 14.6, జూపాడుబంగ్లా 13.8, గడివేముల 12.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. అలాగే కొత్తపల్లె 10.6, బండిఆత్మకూరు 7.8, ఆత్మకూరు 7.6, పాములపాడు 6.8, ఆళ్లగడ్డ 6.8, రుద్రవరం 3.2, గోస్పాడు 3.2, పాణ్యం 2.6, చాగలమర్రి 2.6, డోన్ 1.2ఎంఎం వర్షపాతం నమోదైంది.

కర్నూలు జిల్లాలో వర్షపాతం

గోనెగుండ్ల 13.8, నందవరం 11.6, ఆస్పరి 11.2, ఆలూరు 11.2, హోళగుంద 7.2, సి.బెళగల్ 6.0, గూడూరు 5.0, కర్నూలు 4.6ఎంఎం వర్షపాతం నమోదైంది.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌హాల్‌లో అధిక వర్షాలు, ఐగాట్ కోర్స్ పూర్తిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ తీగలు తెగిపోవడం, మట్టిమిద్దెలు కూలిపోవడం వల్ల ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐగ్యాట్ పరమయోగి యాప్‌లో వివిధ కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సామర్థ్యాలను పెంపొందించుకోవడం, నైపుణ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా రూపొందించినట్లు తెలిపారు. చాలా రకాల కోర్సులను అందిస్తున్నారని, అందులో మూడు తప్పనిసరి కోర్సులను ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తీర్ణత సాధించాలని, వారికి సర్టిఫికెట్లను కూడా ఇస్తామన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయానికి వరద


మేఘాలతో కమ్మేసిన తుంగభద్ర జలాశయం

హాలహర్వి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఆరంభంలోనే తుంగభద్ర జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల రోజురోజుకి నీటి నిల్వ పెరుగుతోంది. సాధారణంగా మే నెలలో తుంగభద్ర ప్రాజెక్టులో నీటి నిల్వ డెడ్ స్టోరేజీకి పడిపోతుంది. కానీ ఈ ఏడాది ఎగువ ప్రాంతాలైన శివమొగ్గ ఆగుంబె, హరిహర, మలేనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ముందస్తుగా వరదనీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. దీంతో నాలుగు రోజులుగా 5 టీఎంసీలు నీరు జలాశయంలోకి వచ్చి చేరడంతో 11 టీఎంసీలకు చేరింది. తుంగభద్ర జలాశయం కింద సాగు చేసుకునే రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సాధారణంగా తుంగభద్ర జలాశయానికి జూన్ రెండో వారంలో ఇన్‌ఫ్లో ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ముందస్తు రుతుపవనాల రాకతో వరద పోటెత్తుతోంది. వారం రోజుల క్రితం 6 టీఎంసీలు నిల్వ ఉన్న జలాశయం ప్రస్తుతం 11 టీఎంసీలకు చేరుకుంది. దీంతో కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాల పరిధిలోని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి 6,595 క్యూసెక్కుల మేర వరద కొనసాగుతోంది.

11 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

వానలే.. వానలు



(3వ పేజీతరువాయి)

అదేవిధంగా కందులు, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న, మిర్చి, ఉల్లి, పొద్దుతిరుగుడు, వరి తదితర పంటలన్నీ కలిపి మరో 4 లక్షల హెక్టార్లలో సాగవుతాయని జేడీలు కమిషనర్‌కు పంపిన నివేదికలో పేర్కొన్నారు.

3.50 లక్షల టన్నుల ఎరువులు అవసరం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 6.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయనీ, దాదాపు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల మేర యూరియా డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులు అవసరమవుతాయని నివేదికలో తెలిపారు. ఈసారి ఎరువుల పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు ఉండకపోవచ్చని ఉమ్మడి జిల్లాకు అవసరమైన ముఖ్యమైన ఎరువులు డీఏపీ యూరియా ఎరువులను పూర్తిస్థాయిలో ప్రభుత్వం అందించేందుకు చర్యలు చేపడుతోందని కర్నూలు జేడీ వరలక్ష్మి, నంద్యాల జేడీ మురళీకృష్ణ వెల్లడించారు.

నాసిరకం విత్తనాలపై నిఘా

పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు సంబంధించి నాసిరకం విత్తనాలు రైతుల దరి చేరకుండా చర్యలు చేపట్టేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. 2021-23 సంవత్సరాల్లో ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంట సాగుకు సంబంధించి నాసిరకం పత్తి విత్తనాల వినియోగం కారణంగా రైతులు భారీగా నష్టపోయారు. ఈ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఉమ్మడి జిల్లాల వ్యవసాయ శాఖ జేడీలు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ నష్టానికి సంబంధించి రైతులకు నష్టపరిహారం అందించకుండా ఎరువుల కంపెనీ యజమాన్యాలకే వత్తాసు పలకడం దారుణమని అప్పట్లో రైతులు ఆందోళన చెందారు. కూటమి ప్రభుత్వమైనా ఆ నష్టాన్ని తమకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రస్తుతం రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఖరీఫ్‌లో జిల్లాలో వివిధ పంటల సాగు విస్తీర్ణం ఇలా..

పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	12,919
జొన్న	313
సద్ద	3,939
మొక్కజొన్న	5,101
కొర్ర	2,679
కందులు	33,296
పెసలు	203
వేరుశనగ	54,710
పొద్దుతిరుగుడు	826
ఆముదం	8,951
పత్తి	2,34,409
చెరుకు	127
మొత్తం	**3,57,633**

ఈసారి పంటల సాగుకు అనుకూలం



గత సంవత్సరం మాదిరే ఈసారి కూడా మే నెలలోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఈ వానలు ముందస్తు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. చీడపీడలు దరిచేరవు. గత సంవత్సరం ఖరీఫ్‌లో పత్తి 2.34 లక్షల హెక్టార్లలో సాగైంది. ఈసారి మరో 14వేల హెక్టార్లలో అధికంగా సాగయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీకి సంబంధించి 40 శాతం సబ్సిడీని అందిస్తోంది. రైతులకు నాణ్యమైన వివిధ పంటలకు సంబంధించి విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టాం. రైతులు తప్పనిసరిగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే ముందు సంబంధిత దుకాణం డీలర్లతో రసీదులు తీసుకోవాలి. డీలర్లు ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరను వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తాం. లైసెన్సులు కూడా రద్దు చేసేందుకు వెనుకాడం.

\- వరలక్ష్మి, వ్యవసాయ శాఖ జేడీ

కర్నూలును టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్



టీబీ ముక్త్ భారత్ అభియాన్ పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్/హాస్పిటల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలును టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జూన్ 2వ తేదీన ప్రారంభమవుతుందని తెలిపారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ప్రచారానికి, పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ-పీడీ, మెప్మా పీడీ వంటి అన్ని ఇతర విభాగ అధికారులు ఈ జాతీయ ప్రాధాన్యత చొరవతో చురుకుగా పాల్గొని సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డీఎస్ఎంవో డాక్టర్ జి.మల్లికార్జున రెడ్డి, జిల్లా టీబీ సహాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కారుమబ్బుల కాంతిరేఖ..

నీలి ఆకాశంలో తేలినట్లు కనిపిస్తున్న కారుమబ్బులపై సోమవారం సాయంత్రం ఏర్పడ్డ ఇంద్రధనస్సు ఆకట్టుకుంది. ఓవైపు చిన్నపాటి వర్షతుంపరలు పడుతుండగా సప్తవర్ణాలతో మేఘాలకు హారంగా మారింది. ఉత్తర, దక్షిణ దిక్కులను కలిపినట్లు హరివిల్లు విప్పారింది. దీంతో పలువురు తమ సెల్‌ఫోన్లలో ఇంద్రధనస్సును బంధించారు. సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. కారుమబ్బులకు కాంతిరేఖ మాదిరి ఇంద్రధనస్సు వర్ణశోభితమయింది.

\- కోడుమూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

గిరిజనుల అభివృద్ధికి చర్యలు

కర్నూలు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన వర్గాల సామాజిక- ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచి వారి అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా దేశంలోని 549 జిల్లాలోని 63,843 గిరిజన గ్రామాలను మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. 500 మంది జనాభా, అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన కనీసం 50 శాతం గిరిజన నివాసితులు కలిగిన జిల్లాలోని గ్రామాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, సామాజిక- ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యం అన్నారు. వ్యక్తిగత కమ్యూనిటీ స్థాయిలో హౌసింగ్, రోడ్డు, ఎల్‌పీజీ తదితర మౌలిక వసతుల కల్పన, వైద్య, ఆరోగ్యం పోషకాహారం, విద్య, శిక్షణ విద్యుద్దీకరణ, కనెక్టివిటీ, ఆర్థిక సాధికారత లక్ష్యాలతో 17 శాఖల ద్వారా ఈ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో 7 గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి తండా, నెరణికి, హొళగుంద మండలంలోని హొళగుంద, కోగిలతోట, మద్దికెర మండలంలోని పెరవలి, మద్దికెర (తూర్పు), హంపా గ్రామాలను ఈ పథకం కింద అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గందరగోళం!

- వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం
- ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం అన్న విమర్శలు
- జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు
- కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీఏ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీఏలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఏలు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీఏలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీఏ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితోపాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే న్యాయం చేసినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కేడర్లలో ఐదేళ్లు పూర్తికాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరికొందరు అధికారుల దరఖాస్తులను పక్కనపెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులు వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీఏలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. రిక్వెస్ట్ బదిలీల్లో అన్ని కేడర్లలో కొందరు ఉద్యోగులకు ఒక న్యాయం.. మరికొందరికి మరో విధంగా వ్యవహరించడంపై బాధిత వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులు, ఉద్యోగులకు చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్.. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థానచలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండటం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..? చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు నిలదీస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేక్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీఏ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.



కౌన్సెలింగ్ హాల్ బయట ఎదురుచూస్తున్న అధికారులు

విత్తులో జాగ్రత్త..!

- పంటల సాగులో విత్తన ఎంపికే కీలకం
- అప్రమత్తంగా లేకపోతే చివరికి నష్టాలే



ఆత్మకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందస్తుగానే నైరుతీ రుతు పవనాలు రాష్ట్రాన్ని తాకుతున్నాయి. దీంతో సకాలంలో తొలకరి వర్షాలు కురుస్తుండటంతో అన్నదాత ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్నారు. అయితే పంటల దిగబడుల్లో అత్యంత కీలకం విత్తనమే. సరైన విత్తనాన్ని ఎంచుకున్నట్లయితే అధిక దిగుబడులను సాధించవచ్చు. అదే నకిలీ, నాసిరకంగా విత్తనాల వినియోగిస్తే చివరికి నష్టాలే మూటకట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో ముందు నుంచే విత్తనాల ఎంపిక పట్ల అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకించి పంటల దిగుబడులు ఆశాజనకంగా రావాలంటే ఎరువులు, పురుగుల మందులతో పాటు విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే నామమాత్రపు దిగుబడులు కూడా రాక పెట్టుబడులు చేతికి అందక నష్టాలను భరించాల్సి వస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో రైతులు నకిలీ, నాసిరకం విత్తనాలను సాగుచేసి నష్టాలను చవిచూశారు. నకిలీ కంపెనీల విత్తనాలపై విజిలెన్స్, వ్యవసాయాధికారులు అనేక తనిఖీలు చేస్తున్నప్పటికీ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు జోరు తగ్గడం లేదు. ఈ పరిస్థితుల్లో అన్నదాతలే విత్తనాల ఎంపికలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది.



జాగ్రత్తలు తీసుకోండి

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్ తయారైన తేదీ (డీఓపీ), పరీక్షించిన తేదీ (డీఓటీ), గడువు తేదీ సరిగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి. విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలు ఉన్నా, తడిసిన విత్తనాలను కొనుగోలు చేయకపోవడం ఉత్తమం. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమశాతాన్ని కూడా చూసుకోవాలి.

అక్రమార్కుల వలలో చిక్కొద్దు..

కొంత మంది వ్యాపారులు గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు అమ్మే వారి వద్ద కొనుగోలు చేయరాదు. కొన్ని నకిలీ కంపెనీలకు చెందిన విత్తనాలను బ్రాండెడ్ కంపెనీ అంటూ ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో తప్పుడు ప్రచారం చేస్తూ ఆయా గ్రామాల్లోని పెద్దమనుషులతో సంప్రదించి గ్రామంలోని రైతులందరు గంపగుత్తగా అవే విత్తనాలను కొనుగోలు చేసేలా ఒత్తిళ్లు చేస్తుంటారు. అలాంటి విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరలకే విత్తనాలంటూ కొందరు లూజుగా విక్రయాలు జరుపుతుంటారు. ధర తక్కువని ఆశ పడితే చివరికి నష్టాలు తప్పవు. ఇలాంటి వ్యక్తుల గురించి వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

నిషేధిత విత్తనాలకు దూరంగా ఉండాలి

పత్తికి సంబంధించి బీటీ-3 రకం విత్తనాలు కొనుగోలు చేయకూడదు, సాగు చేయరాదు. పర్యావరణానికి పెనుముప్పుగా మారి ఈ రకం పత్తి విత్తనాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో పాటు వీటిని నిషేధించింది. దీంతో బీటీ-3 పత్తి రకం విత్తనాలను కొనవద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నప్పటికీ అక్కడక్కడ చోట్ల రైతులు బీటీ-3 రకం విత్తనాలను గుట్టుగా విక్రయిస్తున్నారు. అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు అక్కడక్కడ రహస్యంగా ఈ విత్తనాలను వేస్తున్నారు. కాగా ఇప్పటికే నిషేధిత విత్తనాల అమ్మకాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టారు.



పొలంలో విత్తనాలు విత్తుతున్న కూలీలు

రైతులు జాగ్రత్తలు పాటించాలి



రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు కొనుగోలు చేసేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా విత్తన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే విత్తనాలను కొనుగోలు చేయాలి. అలాగే కొనుగోలుకు సంబంధించిన రశీదును తప్పనిసరిగా పొందడంతో పాటు కొనుగోలు చేసిన విత్తనాల నమూనాలు, వాటి ప్యాకెట్‌ను భద్రపర్చుకోవడం ఉత్తమం. మాయమాటలతో నాసిరకం, నకిలీ కంపెనీల విత్తనాల అమ్మే వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి. అలాంటి వారి గురించి వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఒకవేళ నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోయినట్లయితే పూతదశలో ఉన్నప్పుడే వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి. శాస్త్రవేత్తల సూచనలతో నష్టనివారణ చర్యలకు చొరవ తీసుకుంటాం. ప్రత్యేకించి విత్తన నాణ్యతను తెలుసుకునేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఉండే అగ్రి బయో ల్యాబ్‌లో సీడ్ శాంపిల్స్ తీసుకొచ్చినట్లయితే వాటిని పరీక్షించి ఉచితంగానే ఫలితాలను వెల్లడిస్తాం. నిషేధిత విత్తనాలను విక్రయించినా కేసు నమోదు చేస్తాం.

\- ఆంజనేయులు, ఏడీఏ, ఆత్మకూరు

పసుపు పండుగ..!

(3వ పేజీ తరువాయి)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తున్న రోజులవి. 1982 మార్చి 29న మధ్యాహ్నం 2:30 గంటలకు హైదరాబాద్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వేదికగా జరిన సభలో తెలుగుప్రజల ఆరాధ్య నటుడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ప్రకటించారు. 'నేను తెలుగువాడిని.. నాది తెలుగుదేశం పార్టీ.. నా పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం' అంటూ చారిత్రాత్మక ఘట్టానికి ఊపిరి పోశారు ఎన్టీఆర్. ఆ తరువాత 1982 ఏప్రిల్ 11న హైదరాబాద్ నిజాం కాలేజీ మైదానం వేదికగా టీడీపీ తొలి బహిరంగ సభ జరిగింది. ఆ సభకు ఉమ్మడి జిల్లా నుంచి బీవీ మోహన్‌రెడ్డి (కర్నూలు), శేగు వెంకటరమణయ్యశెట్టి (డోన్), సోమిశెట్టి వెంకటేశ్వర్లు (కర్నూలు), ఉచ్చప్ప (పత్తికొండ), తంగడంచ వెంకటస్వామి (నందికొట్కూరు), బీవీ రెడ్డి (కర్నూలు), సంజీవరెడ్డి (నంద్యాల) తొలి టీడీపీ సభకు హాజరయ్యారు. ఎన్టీఆర్ వెంట నడిచి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 1982 మే 28న తిరుపతిలో జరిగిన సభకు కర్నూలు జిల్లా నుంచి పెద్దఎత్తున ఎన్టీఆర్ అభిమానులు తరలివెళ్లారు. సామాన్యుల్లో రాజకీయ చైతన్యం కలిగించాలనే ఆశయంలో ఎన్టీఆర్ 'చైతన్య రథయాత్ర'కు శ్రీకారం చుట్టారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి, భ్రమరాంబదేవిలకు ప్రత్యేక పూజలు చేసి ఎన్టీఆర్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో చైతన్య రథయాత్రకు శ్రీకారం చుట్టారు. ఆత్మకూరు, నందికొట్కూరు, కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, డోన్, బనగానపల్లె, నంద్యాల, ఆళ్లగడ్డ మీదుగా సాగింది. 20 రోజులపాటు ఈయాత్రలో మమేకమయ్యామని నాడు ఎన్టీఆర్ అడుగుల్లో అడుగులేసిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆంధ్రజ్యోతికి వివరించారు. 1983 ఉన ఎన్నికల్లో బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు నుంచి పోటీ చేసి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో స్థానం సంపాదించారు.

కడపకు తెలుగు తమ్ముళ్లు

కడప నగర శివారున సీకే దిన్నె కేంద్రంగా తెలుగుదేశం పార్టీ 43వ మహానాడు నేటి నుంచి (27, 28, 29వ తేదీల్లో) మూడు రోజులు జరుగనుంది. 27, 28వ తేదీల్లో టీడీపీ ప్రతినిధుల సమావేశం ఉంటుంది. టీడీపీ జాతీయ, రాష్ట్ర కమిటీల్లో ముఖ్య హోదాలో ఉండే నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రతినిధుల సమావేశాలకు హాజరవుతారు. అలాగే యువనేత నారా లోకేశ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా 'జీవితకాల సభ్యత (లైఫ్ టైం మెంబర్‌షిప్)' నమోదుకు ఈ ఏడాది శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లాలో 24, నంద్యాల జిల్లాలో 13 మంది లైఫ్ టైం సభ్యులు ప్రతినిధుల సభకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 2 వేల మందికి పార్టీ నుంచి ఆహ్వానాలు అందాయి. పార్టీ ఆదేశాల మేరకు జీవితకాల సభ్యతం నమోదు చేసుకున్న నాయకులను సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరులు సన్మానించి ప్రత్యేక ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఉమ్మడి జిల్లాకు 750కి పైగా బస్సులతో పాటు నాయకులు ఎవరికి వారు ప్రత్యేక వాహనాల్లో బయల్దేరారు.



మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానితుల పాసును అందజేస్తున్న టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

బందోబస్తుకు 907 మంది

కడపలో నిర్వహించే మహానాడు బందోబస్తు కోసం కర్నూలు జిల్లా నుంచి 448 మంది పోలీసులు, 43 మంది ఏఆర్ పోలీసులు, నంద్యాల జిల్లా నుంచి 391 మంది పోలీస్ సిబ్బంది, 25 మంది ఏఆర్ పోలీస్ సిబ్బందితో పాటు నాలుగు స్పెషల్ పార్టీలు నియమించారు. కర్నూలు జిల్లా నుంచి సీఐలు 25 మంది, ఎస్‌ఐలు 35, ఏఎస్‌ఐ/హెడ్ కానిస్టేబుళ్లు 55, పోలీస్ కానిస్టేబుళ్లు 200, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుళ్లు/కానిస్టేబుళ్లు 28, మహిళా పోలీసులు 30, హోంగార్డులు 70 మంది, మహిళా హోంగార్డులు ఐదుగురు చొప్పున 448 మందిని నియమించారు. ఏఆర్ విభాగం నుంచి డీఎస్పీ-1, ఆర్ఐ-1, ఆర్ఎస్ఐలు-6, ఏఆర్ ఏఎస్ఐ/హెజీలు-20, ఏఆర్‌పీసీలు-15 కలిపి 43 మందితో పాటు రెండు స్పెషల్ పార్టీలను నియమించారు. అలాగే.. నంద్యాల జిల్లా నుంచి అడిషినల్ ఎస్పీ-1, సీఐలు- 20, ఎస్ఐలు-30, ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు-40, పోలీస్ కానిస్టేబుళ్లు-180, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుళ్లు/కానిస్టేబుళ్లు-20, మహిళా పోలీసులు 25, హోంగార్డులు-70, మహిళా హోంగార్డులు 5 మంది చొప్పున 391 మందిని నియమించారు. ఏఆర్ విభాగం నుంచి అడిషినల్ ఎస్పీ-1, ఆర్ఐ-1, ఆర్ఎస్ఐలు-2, ఏఆర్ ఏఎస్ఐ/హెజీలు-15, ఏఆర్‌పీసీలు-6 కలిపి 25 మందితో పాటు రెండు స్పెషల్ పార్టీలను నియమిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే బందోబస్తు విధుల్లో భాగంగా పోలీస్ సిబ్బంది కడపకు చేరుకున్నారు.

ఉపకార వేతనాలు విడుదల

కర్నూలు ఎడ్యుకేషన్, మే 26 (ఆంధ్రజ్యోతి): 2023-24 విద్యాసంవత్సరానికి గానూ సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడికల్, ఇతర కోర్సులు చదువుతున్న ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు కళాశాలలకు మంజూరైన ఉపకార వేతనం 2024 మార్చి 1వ తేదీ వరకు మొదటి విడత ఫీజును విడుదల చేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి కె.తులసీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నాలుగు విడతల ఫీజు విడుదలైందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జమ అయిన నగదు మొత్తాన్ని కళాశాల యాజమాన్యాలకు చెల్లించారో లేదో అన్న విషయాన్ని కర్నూలు జిల్లా వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ వారి పరిధిలో విద్యార్థులకు సంబంధించి 2023-24 విద్యాసంవత్సరానికి మంజూరు కళాశాల ఉపకార వేతనం (ఆర్‌టీఎఫ్) బకాయిలను సంబంధిత కళాశాల ఖాతాలకు జమ చేశారో లేదో సర్వే చేసి సంబంధిత సమాచారాన్ని జ్ఞానభూమి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు సంబంధిత జ్ఞాన భూమి యాప్‌లో కళాశాల విద్యార్థులు ఫీజు ప్రభుత్వం మంజూరు చేసిందని, మిగతా ఫీజును విద్యార్థులు చెల్లిస్తే రశీదును జ్ఞాన భూమి యాప్‌లో సంబంధిత అధికారులు అప్‌లోడు చేయాలన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.గోకులపాడు గ్రామానికి చెందిన రైతు బెస్త జయమాదులు(45) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. ఐదున్నర ఎకరాల సొంత పొలంతో పాటు మరో 4 ఎకరాల మామిడి తోట కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పంటల సాగుకు రూ.10 లక్షల అప్పు చేశాడు. పంటల సాగులో నష్టం రావడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక మదనపడ్డాడు. ఆదివారం సాయంత్రం పొలం పని ముగించుకుని, రాత్రి భోజనం అనంతరం పురుగు మందు తాగాడు. వాంతులు, విరేచనాలు కావడంతో గమనించిన భార్య అడగంతో తాను పురుగు మందు తాగానని చెప్పాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య బెస్త జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లిఖార్జున తెలిపారు.



జయమాదులు (ఫైల్)

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆదోని రూరల్, మే 26 ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన గొల్ల మద్దయ్య (52) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల మేరకు.. సోమవారం వర్షం కురియడంతో ఇంటి వద్ద నీరు నిలిచింది. మోటారు ద్వారా నీటిని తోడే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు ఆదోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

'పది' మెయిన్ పరీక్షలు పూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మెయిన్ పరీక్షలు సోమవారం ముగిశాయని డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు 4,962 మంది నమోదు చేసుకున్నారని, వీరిలో 3,697 మంది పరీక్షకు హాజరు కాగా.. 1,265 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. డీఈవో 5 పరీక్ష కేంద్రాలను, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ 2, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 11 పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

కర్నూలు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 1,776 మంది దరఖాస్తు చేసుకోగా 1,620 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. కోసిగి ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో వారిని డిబార్ చేశామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో డోన్ జాతీయ రహదారిలో మానస డాబా ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న ఓ కారు ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. ట్రాఫిక్ స్తంభించడంతో నాలుగో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ట్రాఫిక్ పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. స్థానికులను విచారిస్తే ఎవరూ కూడా ఆ వ్యక్తిని గుర్తించలేదు. ఆచూకీ తెలిసిన వారు 9121101063 నెంబర్‌కు ఫోన్ చేయాలని తాలుకా పోలీసులు తెలిపారు.



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

'పీఆర్' ఉద్యోగుల్లో టెన్షన్

- సీనియారిటీకి ప్రాధాన్యమిస్తారా?
- ఇన్‌చార్జిలు, ఎఫ్ఏసీల స్థానాలను మార్చేరా.?
- నేడు 'అనంత'లో ఉద్యోగులకు కౌన్సెలింగ్



నంద్యాల, మే 26 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిధిలోని పంచాయతీరాజ్ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో బదిలీ టెన్షన్ తారస్థాయికి చేరుకుంది. తాజా ప్రభుత్వ బదిలీ ఉత్తర్వులు ప్రకారం.. రాయలసీమ జోన్-4 పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో పంచాయతీరాజ్ శాఖలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీకి సంబంధించిన కౌన్సెలింగ్ మంగళవారం అనంతపురం జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యాలయంలో జరుగనుంది. దీంతో ఆయా ఉద్యోగులందరూ ఉదయాన్నే సదరు కౌన్సెలింగ్‌కు హాజరుకానున్నారు. ఈ కౌన్సెలింగ్ ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఆధ్వర్యంలో జరుగనుంది. ఈ క్రమంలో ఎవరిని ఎక్కడకు బదిలీ చేస్తారోనన్న ఆందోళన అందరిలో నెలకొంది. అయితే సీనియారిటీ ప్రాతిపాదికన కౌన్సెలింగ్ నిర్వహిస్తారా..? లేక ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో పనిచేస్తున్న వారిని ఆయా స్థానాల నుంచి కదిలిస్తారా..? అర్హులకు తగిన న్యాయం జరుగుతుందా? అన్న సందేహాలు ఆ శాఖ వర్గాల్లో ఉంది. రాయలసీమలోని జోన్-4 పరిధిలోని ఉద్యోగులను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే 26 మంది డీఈఈలు ఉండగా 161 మంది ఏఈ, ఏఈఈలు ఉన్నారు. డీఈఈలు అనంతపురంలో ఏడుగురు, కడపలో 9 మంది, చిత్తూరులో ఐదుగురు, కర్నూలులో ఐదుగురు చొప్పున ఉన్నారు. అదేవిధంగా ఏఈలు, ఏఈఈలను పరిశీలిస్తే అనంతపురంలో 49 మంది, చిత్తూరులో 59, కడపలో 33 మంది, కర్నూలు 20మంది ఉన్నారు. నిబంధనల మేరకు ఐదేళ్లు దాటిన డీఈఈలు 11 మంది ఉండగా ఏఈలు, ఏఈఈలు 19 మంది ఉన్నారు. వీరితో పాటు టెక్నికల్ ఆఫీసర్స్, ఏటీఓలు, జేటీఓలు, సూపరింటెండెంట్లకు బదిలీలు ఉంటాయి. సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్‌ల పరంగా కొందరు కౌన్సెలింగ్‌కు హాజరవుతారు. అంతేకాకుండా రిక్వెస్ట్ బదిలీ కూడా కొన్ని ఉంటాయని సమాచారం.

ఉద్యోగుల్లో వీడని ఉత్కంఠ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీ రాజ్‌శాఖ పరంగా.. రెండో సారి ఉద్యోగుల బదిలీకి సంబంధించి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఆగస్టులో మొదటి విడల బదిలీ కౌన్సెలింగ్ జరిగింది. ఆ తర్వాత నేడు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయితే ఐదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు తప్పనిసరి బదిలీతో రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం కల్పించడంతో ఎవర్ని ఎక్కడికి బదిలీ చేస్తారో..? అనే భయం బాధిత వర్గాల్లో నెలకుంది. గత వైసీపీ ప్రభుత్వ హాయాంలో చాలా మంది పైరవీలు చేసి ఇష్టారాజ్యంగా పోస్టింగ్ పొందారనే విమర్శలు లేకపోలేదు. అదే తరహాలో కూటమి ప్రభుత్వంలోను మొదటి విడతలో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లతో పాటు ఆ తర్వాత కొందరు ఉద్యోగులు ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్స్‌తో పైరవీలు చేసి పోస్టింగ్‌లు పొందరానే విమర్శలు లేకపోలేదు. తద్వారా సీనియారిటీతో పాటు అర్హులైన వారికి అన్యాయం జరిగిందనే ఆరోపణలు ఆశాఖ వర్గాల్లోనే లేకపోలేదు. ఈ నేపథ్యంలో కనీసం నేడు జరిగే బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియలోనైనా అర్హులైన న్యాయం జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలా ఉండగా.. గత కౌన్సెలింగ్‌లో పైరవీలు చేసి రూ. లక్షలు ఖర్చులు చేసి ఇన్‌చార్జి(ఎఫ్ఏసీ, ఓడీలు) డీఈఈ పోస్టింగ్‌లు పొందిన వారి పరిస్థితి ఆగమ్యాగోచరంగా మారింది. తమ పోస్టింగ్ ఉంటుందా..? ఊడుతుందా..? అని ఆందోళన నెలకొంది. ఏదిఏమైనా నేడు జరిగే కౌన్సెలింగ్‌తో ఆ శాఖ ఉద్యోగుల్లో ఉత్కంఠ వీడటం లేదని తెలుస్తోంది.

పంచాయతీ రాజ్ శాఖలో పీఆర్ఐ, పీఐయూ, క్వాసీ విభాగాలు ఉన్నాయి. అయితే ఏళ్ల తరబడి బదిలీలు జరిగినా కూడా చాలా మంది ఉద్యోగులు విభాగాల్లోనే పాతుకుపోతున్నారు. పీఆర్ఐలో పనిచేస్తున్న ఉద్యోగి అదే పీఆర్ఐలోని మరో డివిజన్‌కు బదిలీ అవుతున్నారే తప్ప... మరోక విభాగమైన క్వాసీ, పీఐయూ విభాగాలకు బదిలీ కావడం లేదు. పీఐయూ, క్వాసీ విభాగాల్లోనే ఇదే తరహాలో వ్యవహారం సాగుతోంది. ఇదీచాలదన్నట్లు.. నిత్యం ఆఫీస్

పాతుకు పోయారు..!

విభాగాల్లో కూడా చాలా మంది ఉద్యోగులు ఆఫీస్ విభాగాలకే బదిలీ అవుతుండటం పలు విమర్శలకు తావిస్తోంది. చాలా మంది ఉద్యోగులు సైతం ఫీల్డ్ ఉద్యోగాలకు బదిలీ కాకుండా తమదైన శైలిలో చక్రం తిప్పుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కౌన్సెలింగ్‌లో కొందరు ఉద్యోగులకు డిప్యుటేషన్ రూపంలో అన్యాయం జరుగుతోందని సమాచారం.

సీనియారిటీకి ప్రాధాన్యమిస్తారా?

కౌన్సెలింగ్‌లో సిఫార్సులు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హులైన ఉద్యోగులను సీనియారిటీ ప్రాతిపాదికన న్యాయం చేస్తారా? లేదా? అనే సందేహాలు ఉద్యోగుల్లో నెలకొంది. డీఈఈలతో పాటు ఏఈ,ఏఈఈల ఖాళీలు ఎక్కువగా ఉండటంతో ఆయా పోస్టింగ్‌లపై ఉత్కంఠ నెలకుంది. పైగా రెగ్యులర్ డీఈఈలు లేకపోవడంతో పైరవీలకు ఆస్కారం ఎక్కువగా ఉందని ఆశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది. వీటికితోడు ఇదివరకే కొందరు ఏఈ,ఏఈఈలు సైతం తమదైన శైలిలో పైరవీలు చేసి ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో డీఈఈలుగా పనిచేస్తున్నారు. దీంతో ఆయా వారిని తాజా కౌన్సెలింగ్‌లో తప్పించి మిగిలిన వారికి న్యాయం చేయాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

'బాధితులకు న్యాయం చేస్తాం'



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

కర్నూలు క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేసామని డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ బాబు ప్రసాద్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 101 ఫిర్యాదులు వచ్చాయి. డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు కేశవరెడ్డి, తేజమూర్తి ఉన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి హైదరాబాదుకు చెందిన శిరీష, భాను రాథోడ్ రూ.3 లక్షలు తీసుకుని నకిలీ ఆఫర్ లెటర్ ఇచ్చి మోసం చేశారని కర్నూలు గణేష్ నగర్‌కు చెందిన జమున ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ డిపార్టుమెంటులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం గానీ, రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం గానీ ఇస్తామని చెప్పి కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన సురేష్ రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు బాలాజీనగర్‌కు చెందిన నివేదిత ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తన వివరాలు సేకరించి తమ పేరు మీద అసభ్య పదాజాలతో వివిధ అడ్రస్సుల పేర్లతో ఉత్తరాలను రిజిస్టర్ పోస్టు కూడా చేస్తున్నారని కర్నూలు మద్దూరునగర్‌కు చెందిన నగేష్ ఫిర్యాదు చేశారు. తమపై ఉన్న కేసులు కొట్టివేసినా కూడా పొలాలను వ్యవసాయం చేసుకోనీయకుండా అడ్డుపడుతున్నారని, కొంత మంది వ్యక్తులు వచ్చి దుర్భాషలాడుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గ్రామంలోకి రానీయడం లేదని మంత్రాలయం మండలం, తిమ్మాపురం గ్రామానికి చెందిన సుధాకర్, సుదర్శన్, నర్సప్ప ఫిర్యాదు చేశారు. తన కుమారుడు మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని కొడుతున్నాడని, ఇంట్లో ఉన్న వస్తువులు పగులకొట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు పాతబస్తీకి చెందిన విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు.

ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు పోటీలు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు పోటీలు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం పర్యావరణ ఇంజనీరు పీవీ కిషోర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు మే 28న చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఏర్పాటు చేస్తున్నామని, విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. మాధవీనగర్‌లోని సైన్స్‌పార్కు సమీపంలోని రవీంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఈ పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 99128 07127 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్లు

- పోర్టల్ హైపర్ టెన్షన్ రోగులకు శస్త్రచికిత్సలు విజయవంతం



రోగులతో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు

కర్నూలు హస్పిటల్, మే 26(ఆంధ్రజ్యోతి): పోర్టల్ హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న అనంతపురం, నంద్యాల జిల్లాలకు చెందిన ఇద్దరు మహిళా రోగులకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సర్జరీ వైద్యులు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు సోమవారం శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించిన సీనియర్ సర్జరీ ప్రొఫెసర్ డా.పి.రామకృష్ణ నాయక్ అసోసియేట్ ప్రొఫెసర్ సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.మన్సూర్‌బాషా, డా.ప్రణీత్, అనస్థీషియా ప్రొఫెసర్ డా.సుధీర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.మురళి ప్రభాకర్ వైద్య బృందాన్ని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సర్జరీ హెచ్‌వోడీ డా.హరిచరణ్ అభినందించారు.

సర్జరీ ప్రొఫెసర్ డా.రామకృష్ణ నాయక్ అరుదైన శస్త్ర చికిత్స వివరాలను విలేకరులకు వివరించారు. అనంతపురం జిల్లా బాల వెంకటాపురానికి చెందిన 29ఏళ్ల పర్వీన్ గర్భాశయ రక్తస్రావంతో బాధపడుతూ ఏప్రిల్ 27వ తేదీ ఆసుపత్రిలో చేరిందని తెలిపారు. పోర్టల్ హైపర్‌టెన్షన్‌తో బాధపడు తున్న ఆమెకు ఎండోస్కోపిలో అన్నవాహికలో వేరిసెస్ గుర్తించి బ్యాండ్‌లిగేషన్ అనంతరం పెద్దపరిమాణంలో కొల్లాటెరల్స్, పోర్టల్ క్యావెర్నోమా గుర్తించినట్లు తెలిపారు. స్ప్లీనెక్టమీ ఈ నెల 3వ తేది నిర్వహించగా, స్ప్లీన్ బరువు 1.5 కిలోలుగా నమోదైందని చెప్పారు. ప్రాథమికంగా 50వేలు ఉన్న రక్తకణాలు అనంతరం 4లక్షలకు పెరగిం దని, ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉందని తెలిపారు.

అలాగే నంద్యాల జిల్లా పాములపాడుకు చెందిన 15 ఏళ్ల ఎలిషారాణి వాంతుల్లో రక్తస్రావం వంటి లక్షణాలతో ఈ నెల 5వ తేదీన అడ్మిషన్ పొందగా, 8వ తేదీన ఆపరేషన్ నిర్వహించినట్లు డా.రామకృష్ణ నాయక్ తెలిపారు. రోగి వచ్చిన సమయానికి హిమోగ్లోబిన్ 6 గ్రాములు, ప్లేట్‌లెట్ కణాలు 60వేలుగా ఉండటంతో ఎండోస్కోపి బ్యాండ్‌లిగేషన్ చేశామని చెప్పారు.

అనంతరం ఆపరేషన్ పరిశీలనలో స్ప్లీనోరినల్ స్టంట్ ఆపరేషన్‌ను ఈ నెల 6వ తేదీ నిర్వహించగా, రోగి రక్తకణాలు 5 లక్షలకు పెరిగాయని తెలిపారు. ఆపరేషన్ అనంతరం లక్షణాలు బాగా తగ్గిపోయి రోగి ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. కార్యక్రమంలో అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డా.మురళి ప్రభాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.రఘు ప్రవీణ్, డా.సంధ్యా, జనరల్ సర్జరీ, పీజీ వైద్య విద్యార్థులు డా.సర్పరాజ్, డా.సాయిచరణ్, డా.శిరీష పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

- పొలం అగ్రిమెంట్ పత్రాలపై మోసపూరితంగా సంతకాలు
- సాయం చేసిన వ్యక్తిపై దాడి చేశారు
- కోసిగి పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

కోసిగి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి సంతకం చేయించుకొని మోసం చేశారని సజ్జల గుడ్డం గ్రామానికి చెందిన హరిజన ఎల్లప్ప ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సజ్జలగుడ్డం మజార గ్రామమైన దేవరబెట్టలో సర్వే నెంబరు 28/2ఏలో 30 సెంట్లు, 28/3ఏలో 95 సెంట్ల భూమి ఉందని తెలిపారు.

గ్రామంలో డ్రైనేజీ కాలువలు క్లీన్ చేసే ఉద్యోగం ఇప్పించి, నెలకు రూ.10వేలకు జీతం ఇప్పిస్తామని నమ్మించి మోసం చేశారని అన్నారు. ఉద్యోగ నియామక పత్రాలు అని చెప్పి తమ నాన్న పేరు మీద ఉన్న పొలంలో 50 సెంట్లను గజ్జప్ప కుమారుడు ఎల్లప్పకు భాగం ఇచ్చినట్లు మోసపూరితంగా అగ్రిమెంటుపై సంతకం చేయించుకున్నారన్నారు. వైసీపీ నాయకులు తనపై, తనపై భార్యపైన కూడా దాడి చేశారని, ఇదే విషయాన్ని ఆదోని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈనెల 25న చదును కోసం తమ పొలాన్ని ట్రాక్టరుతో దున్నిస్తుండగా.. వైసీపీ నాయకులు ఎల్లప్ప, ఉలిగప్ప, కురువ వెంకటేశ్ అడ్డుపడి తన వెంట వచ్చిన వ్యక్తిపై దాడి చేసి గాయపరిచారని అన్నారు. కురువ వెంకటేశ్ అనే వ్యక్తి కులం పేరుతో దూషించి కాలితో తన్నాడన్నారు. ఇదే విషయంపై కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ హనుమంత రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఎల్లప్ప తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ హనుమంత రెడ్డిని వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితుడు ఎల్లప్ప

31న సంగమేశ్వరానికి తరలిరండి



నారాయణపురంలో పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

బండిఆత్మకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరం అలుగు సాధనకై 31న చేపట్టిన సంగమేశ్వరం ప్రజా బహిరంగ సభకు రైతులు, కూలీలు తరలిరావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నారాయణపురం, చిన్నదేవళాపురం, జీసీ పాలెం గ్రామాల్లో రైతులతో కలిసి సమితి నాయకులు రాముడు, రాఘవేంద్రగౌడ్ వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో చిన్నమద్దిలేటి, శివుడు తదితరులు పాల్గొన్నారు.

వాగు స్థలం కబ్జా



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పాణ్యం, మే 26 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం జుర్రాగు వాగును విజయానికేతన్ పాఠశాల యజమాన్యం కబ్జా చేసిందని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజా సంఘాలు ఫిర్యాదు చేశారు. సోమవారం మాలమహానాడు డివిజన్ నాయకులు దేవదత్తు, ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్ నరేంద్రనాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. వాగు సర్వే నెంబరు 1200లోని వంద అడుగుల మేర ఆక్రమించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు కబ్జా చేసిన వాగు స్థలాన్ని సర్వే చేసి సంబంధిత పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



ఏపీ ఫుడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్‌ను కలిసిన విశ్వనాథరెడ్డి

నంద్యాల రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విజయవాడలో ఏపీ ఫుడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ విజయకుమార్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట అజయ్, శ్రీనివాసరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

మిడుతూరు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్ట పొలాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ ఎంఎల్ లిబరేషన్, ఎం సీపీఐయూ, సీపీఐ ఎమ్ఎల్ న్యూ డెమోక్రసీ 2, సీపీయూఎస్ఐ పార్టీల నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఐయూ జిల్లా కన్వీనర్ లాజరస్, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు వెంకేశ్వర్లు, సీపీఐ ఎమ్ఎల్ న్యూడెమోక్రసీ2 నాయకులు నవీన్ మాట్లాడుతూ మండలంలోని మెట్ట భూములకు హంద్రీనివా లిఫ్టు ద్వారా సాగు నీరు అందించాలన్నారు. అలగనూరు రిజర్వాయర్, ఎస్ఆర్‌బీసీ, హంద్రీ నివా సుజల స్రవంతి ద్వారా నీరు అందుబాటులో ఉన్నా మండలానికి మాత్రం చుక్కనీరు అందడం లేదన్నారు. ఎన్నికల ముందు మాత్రం మెట్టభూములకు సాగునీరు అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులు వినతి అందించారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు శ్రీనివాసులు, డక్కా కుమార్, ఏసన్న, నరసింహులు, పెద్దరాముడు, స్వామన్న, సోమప్ప, లింగన్న,మాబాషా, లక్ష్మిదేవి, నాగమణి, మల్లమ్మ పాల్గొన్నారు.

సోషలిజం స్థాపనకు కమ్యూనిస్టు పార్టీ ప్రత్యామ్నాయం



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): దేశంలో సోషలిజం స్థాపనకు కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే ప్రత్యామ్నాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం పేర్కొన్నారు. సోమవారం స్థానిక థెరిసా జూనియర్ కళాశాలలో మత సామరస్యం వర్ధిల్లాలి.. దేశ సమైక్యత, సమగ్రత కోసం పాటుపడాలి అనే నినాదంతో నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. పహల్గామ్‌లో 26 మంది అ మాయకులను బలిగొన్న ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నరసింహానాయక్, మహెబూబ్‌బాషా, రామ్‌నాయక్, సురేం ద్ర, నాగేశ్వరరావు, వీరన్న, స్వాములు, వెంకటేశ్వర్లు, మాబాషా, సంజీవరాయుడు, దాసు, కిరణ్, శివుడు ఉన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నంద్యాల నూనెపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు కర్మాగారంలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు భూమని శ్రీనివాసులు, కార్యదర్శి డి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికుల హక్కులను కాలరాస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం

- నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు
- రహదారుల వెంట చెత్త వ్యర్థాలు

గ్రామాలు చెత్తతో కంపుకొడుతున్నాయి. గ్రామాల్లో సేత్త సేకరణ చేయకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారాన్ని పారవేస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలో చెత్తను సేకరించి వాటి నుంచి తడి పోడి వేరు చేసి సేంద్రియ ఎరువు తయారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకోసం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వమైన స్పందించి యార్డులను పునఃప్రారంభించి గ్రామ పంచాయతీలకు ఆదాయం పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నంద్యాల మండలం పెద్దకొట్టాలలో నిరుపయోగంలో ఉన్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం

నంద్యాల రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీల నుంచి చెత్త వ్యర్థాలు సేకరించి వాటి ద్వారా వర్మి కంపోస్టు తయారు చేసి విక్రయించి ఆదాయం సమకూర్చుకోవాలన్న లక్ష్యం నీరుగారింది. గత టీడీపీ ప్రభుత్వం హయంలో గ్రామాల్లో రూ.లక్షల్లో వెచ్చించి నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు ఆరేళ్లుగా ఉత్సవ విగ్రహాలుగా మారాయి. తడి పోడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారికీ అనుగుణంగా చేసిన ఏర్పాట్లు ప్రస్తుతం నిరూపయోగంగా ఉన్నాయి. ప్రారంభంలో కేంద్రాలు సజావుగా పనిచేసినప్పటికీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గాలికివదిలేసింది. చెత్త పన్నులు వసూలు చేసిన జగన్ ప్రభుత్వం స్వచ్ఛతను మరిచిపోయింది. గ్రామాల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు పంట కాలువలు ఎక్కడ చూసిన చెత్తా చెదారం దర్శనమిస్తోంది. కూటమి ప్రభుత్వమైన డంప్ యార్డులను ఉపయోగంలోకి తీసుకొచ్చి పంచాయతీలకు ఆదాయం పెంచే విధంగా చర్యలు చేపట్టాలి.

శాస్త్రీయ విధానాలతో మేలు...

వ్యర్థాలు వినియోగంలో శాస్త్రీయ విధానాలు అనుసరిస్తే సరికొత్త సంపద సృష్టించవచ్చు తడి పోడి వ్యర్థాల విషయంలో సృజనాత్మకత ఆలోచన చేసి వాటిని పునర్వినియోగిస్తే పారిశుధ్యం సమస్యనూ అధిగమించోచ్చు. ఆకులు కొమ్మలు, పొడి, చెత్త కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం జరుగుతుంది. వాటిని కంపోస్టుగా మారిస్తే ఎరువు తయారువుతుంది. ఈ విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా....

పంచాయతీల్లో చెత్త శుద్ధి కేంద్రాల నిర్మాణాలు పూర్తయి ఏళ్ల గడుస్తున్న వాటి వినియోగం జరగడం లేదు. దీంతో ప్రభుత్వం ఆశయం నెరవేరకుండా పోయింది. ఈ కేంద్రాలు ఉపయోగించుకుంటే పంచాయతీలకు ఆదాయం పెరుగుతుంది. రహదారలు వెంట చెత్త చెదారం పారబోయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ కేంద్రాల్లో రాత్రి సమయంలో ఆకతాయిలకు, మందుబాబులకు అడ్డాగా మారాయి.

అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. సేంద్రియ ఎరువుల తయారు చేసేలా కృషి చేస్తాం. పంచాయితీలకు ఆదాయం సమాకూర్చే దిశగా నిర్వహణ మార్పులు తీసుకువస్తాం. జిల్లాలోని 489 గ్రామాలకు గానూ 348 సంపదసృష్టి కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇందులో 278 పూర్తిగా పని చేస్తున్నాయి. 70 పాక్షికంగా పనిచేయడం లేదు. 141 గ్రామాల్లో షెడ్ నిర్మాన పనులు చేపట్టలేదు. స్థలాలులేక పోవడంతో ఆగి పోయాయి. తహసీల్దార్లకు స్థలాలు చూపాలని కోరాం. త్వరలో మిగిలిన గ్రామాలలో కూడా పనులు ప్రారంభిస్తాం.

- ఇన్‌చార్జి డీపీవో శివారెడ్డి, నంద్యాల



బండిఆత్మకూరు మండలం ఎ.కోడూరులో నిరుపయోగంగా ఉన్న కేంద్రం

యోగాంధ్రపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమాలపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం పీజీఆర్ఎస్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వోరామునాయక్, డిప్యూటి కలెక్టర్లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి యోగాపై అవగాహన కల్పించడంతో పాటు ప్రతిఒక్కరిని యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, వారి కుటుంబసభ్యులు నమోదు కావాలన్నారు. జిల్లా స్థాయిలో 130మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చామని, వీరి ద్వారా ప్రతి మండలంలో 200మందికి శిక్షణ ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 5పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 31 శ్రీశైలంలో, జూన్ 7న మహానందిలో, జూన్ 16న జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయాల సిబ్బందితో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు.

● జాబ్‌మేళాతో ఉపాధి పొందాలి

నిరుద్యోగుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళా ద్వారా ఉపాధి అవకాశాలను పొందాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జాబ్‌మేళా పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన 3జాబ్‌మేళాల ద్వారా ఎంతోమంది యువత ఉపాధి పొందారని, తద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జూన్ 5న బనగానపల్లె నియోజకవర్గంలోని కేజీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామని, 15ప్రైవేట్ కంపెనీల్లో జాబ్‌ల భర్తీ ఉంటుందన్నారు.

విద్యార్థినిని అభినందించిన జేసీ



పుస్తకాన్ని జేసీకి అందజేస్తున్న ప్రణవి భూపాల్

నంద్యాల నూనెపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరుకు చెందిన డిగ్రీ విద్యార్థిని ప్రణవి భూపాల్‌ను జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అభినందించారు. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న ప్రణవి భూపాల్ ఆత్మన్యూనతాభావానికి లోనై వ్యక్తపరచలేని భావాలను తెలుసుకునేందుకు అన్‌స్పోకెన్ ఫ్యామిలీ పుస్తకాన్ని రచించి సోమవారం జేసీ చేతులమీదుగా ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ చిన్న వయసులోనే 226 పేజీలున్న పుస్తకాన్ని రచించి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ప్రస్తుతం యువత సెల్‌ఫోన్ మాయలో ఉంటే ప్రణవి సైకలాజికల్ పుస్తకం రాయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని జేసీ అభినందించారు. విద్యార్థినిని ప్రోత్సహించిన ప్రణవి తల్లి డిప్యూటీ తహసీల్దార్ అరుణ, తండ్రి రాంభూపాల్‌ను జేసీ అభినందించారు.

దుకాణాల తనిఖీ

నంద్యాల కల్చరల్, మే 26(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని హోల్‌సేల్ దుకాణాలలోని బెల్లంను నంద్యాల ఎక్సైజ్ శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. బెల్లంను రెండు శాంపిల్స్ తీసి హైదరాబాదు ల్యాబ్‌కు పంపించారు. వీటిలో ఏదైనా తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో ఎక్సైజ్ సిఐ క్రిష్ణమూర్తి, ఫుడ్‌సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, కాశీంవలి పాల్గొన్నారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం

గడివేముల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన చెన్నకేశవ, ఆంజనేయస్వామి, త్రయంబకేశ్వరస్వామి ఆలయ భూములను సోమవారం పర్యావేక్షణాధికారి నాగప్రసాద్ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. చెన్నకేశవ, ఆంజనేయస్వామి భూములకు రూ.7.12 లక్షలు వచ్చిందని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.2.62 లక్షలు పెరిగిందన్నారు. త్రయంబకేశ్వరస్వామి ఆలయ భూములకు రూ.7.23,100లు వచ్చిందన్నారు. అన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.4.40 లక్షలు అదనపు ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రామసుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

తగ్గిన ఆదాయం

పాములపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపెంట గ్రామంలో దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో 113 ఎకరాల దేవాదాయ భూములను కౌలుకు వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలంలో గత ఏడాది కంటే ఈ ఏడాది ఆదాయం తగ్గిందని దేవాదాయ ఏడీ వెంకటరమణ రూ.1,89,000 తగ్గిందని తెలిపారు. గ్రామంలోని ఈశ్వర స్వామి, ఎల్లమ్మ దేవతా, కేశవ రామచంద్ర ఆంజనేయ స్వామి దేవాలయాలకు చెందిన భూములను కౌలుకు వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వంశీక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్వేసి గ్రామానికి చెందిన జింకల లక్ష్మీదేవికి సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే గౌరుచరిత సీఎం సహాయక నిధి నుంచి రూ.25 వేలు చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్, టీడీపీ నాయకులు శ్రీనివాసయాదవ్‌లు పాల్గొన్నారు.



మహానందిలో కురుస్తున్న వర్షం



ఆత్మకూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కురిసిన వర్షం

మహానంది, మే 26 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మహానంది ఆలయ పరిసరాలతో పాటు మండలంలోని గాజులపల్లి గ్రామంలో సైడ్ ఉన్న కాల్వలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. క్షేత్ర పరిధిలోని ప్రధాన వీధులన్ని జలమయం అయ్యాయి. వేసవి సెలవులను పురస్కరించుకొని దైవ దర్శనం కోసం వచ్చిన యాత్రికులు వర్షంలోనే తడుస్తూ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా సోమవారం మహానందిలో నిర్వహించే పల్లకిసేవను వర్షం కారణంగా రద్దు చేశారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రాంతంలో కూడా గత రెండు రోజులుగా మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా తుంపర వర్షం కురిసింది. అడపాదడపా మోస్తారు వర్షం కురిసింది. అయితే వర్షం కారణంగా పట్టణంలోని పలు ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. దీనికితోడు పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపునీరు

ఆ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలి



రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌కు వినతిపత్రం అందజేస్తున్ననాయకులు

నందికొట్కూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులో ఉన్న బీఎడ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, డీఎస్‌యూ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వెంకట బసవరావుకు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఆది, డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ నాయకులు రంగస్వామి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నందికొట్కూరులో ఉన్న పలు బీఎడ్ కళాశాలలు క్లాసులు నిర్వహించకుండా వేరే రాష్ట్రాల నుంచి విద్యార్థులకు ఇక్కడ అడ్మిషన్లు ఇచ్చి నేరుగా పరీక్షలకు రండి అంటూ విద్యార్థుల నుంచి వేలకు వేల రూపాయలు వసూలు చేసున్నారని ఆరోపించారు. విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ బి.ఎడ్ కాలేజీల గురింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు, డిఎస్‌యు నాయకులు జగదీష్, గణేష్, మహబూబ్, చందు, అశోక్‌లు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేద్దాం

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



ఎమ్మెల్యే బుడ్డాను కలిసిన విజయనగరం జోన్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దన్నుదొర

ఆత్మకూరు, మే 26(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో 27,28,29 తేదీల్లో జరిగే మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మహానాడు కార్యక్రమ శ్రీశైల నియోజకవర్గ పరిశీకులు, విజయనగరం జోన్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దన్నుదొరతో కలిసి పలువురు నాయకులతో చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలుగు దేశం పార్టీ పండుగలా జరుపుకొనే మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని తెలుగు తమ్ముళ్లందరు తరలిరావాలని సూచించారు. అత్యధిక సంఖ్యలో తరలివచ్చి నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు లభించేలా తెలుగు తమ్ముళ్లు బాధ్యతగా వ్యవహరించాలని ఆకాంక్షించారు.

98 జీవో బాధితులకు ఉద్యోగాలు కల్పించాలి



ఆందోళన చేస్తున్న శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగుల సంఘం నాయకులు

నందికొట్కూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్ అన్నారు. సోమవారం నందికొట్కూరులో 98 జీవో నిరుద్యోగులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. పక్కీర్ సాహెబ్ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి జలహారతి ఇచ్చేందుకు వచ్చిన సందర్భంగా శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగులకు కటాఫ్ తేదీ పెంచుతూ రెండో జాబితాకు అర్హులైన నిరుద్యోగులను ఎంపిక చేసే విధంగా హామీ ఇచ్చారు. ఈ జాబితాలో అర్హులైన 674 మంది నిరుద్యోగులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. సమావేశంలో శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగుల సంఘం నాయకులు నారాయణరెడ్డి, నాగశేషశేనారెడ్డి, దర్గయ్య, మక్బూల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొత్తపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో బుధవారం నుంచి 30వ తేదీ వరకు నూతన దేవాలయంలో గణపతి, శివుడు, గిరీ, నందీశ్వర, కుమార స్వామి, వీరభద్ర స్వామి, దక్షిణమూర్తి, ధ్వజ సహిత కలశ శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పూజలు, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆత్మకూరు-కొక్కెరంచ రోడ్డుకు మహర్దశ

రూ.2 కోట్ల నాబార్డు నిధులు మంజూరు



కొత్తపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): గుంతలమయంగా మారిన ఆత్మకూరు-కొక్కెరంచ రోడ్డుకు మహర్దశ వచ్చింది. ఆత్మకూరు వయా దుద్యాల మీదుగా కొక్కెరంచ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు పీఐయూ డీఈ రామ్మోహన్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి కొక్కెరంచ వరకు 13 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును రూ.2 కోట్ల నాబార్డు నిధులతో త్వరలో నిర్మిస్తామనానరు. రెండు రోజుల్లో టెండర్లు పూర్తవుతాయని, నెలోపే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని వివరించారు.

విధుల్లో చేరిన సీహెచ్‌వోలు



డీఎంహెచ్‌ను కలిసిన సీహెచ్‌వోలు

నంద్యాల హస్పిటల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో నిరవధిక సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సోమవారం నుంచి విధులకు హాజరయ్యారు. వారు నంద్యాల జిల్లా వైద్యాధికారి డా.వెంకటరమణను కలిసి సమ్మె విరమించి మళ్లీ విధుల్లో చేరుతున్నట్లు తెలిపారు. రెజ్యూమింగ్ లెటర్‌ను ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ మాట్లాడుతూ సమ్మె కాలంలో సీహెచ్‌ఓలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు భాస్కర్, సెక్రటరీ గురుప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, అఖిల్, భార్గవ్, శ్రీనివాసులు, వినోద్‌కుమార్, హాజీవలి, సాయిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలి

గడివేముల, మే 26 (ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలని కేసీకెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డిలు ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం అలగనూరు రిజర్వాయర్ ఏఈ మనోహర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.36.26 కోట్ల నిధులతో అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు ప్రణాళికలను రూపొందించామని అన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ మే 26(ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో సోముల కాలభైరవ కాళీమాత దేవాలయంలో కాలభైరవ స్వామికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ కుంభాభిషేక మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేకు పూజారులు స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

31న వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

డోన్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఈ నెల 31న వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, ఆహ్వాన కమిటీ ప్రెసిడెంట్ పెద్దయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహం ప్రాంగణంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మహోత్సవానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీలం భాస్కర్ నాయుడు, వాల్మీకి సంఘం నాయకులు న్యాయవాది శివరామకృష్ణ, అభిరెడ్డిపల్లె గోవిందు, శేఖర్ నాయుడు, శ్రీనివాసులు, నాగేష్, వలసల సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గర్భిణులకు, రోగులకు, సహాయకులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లిపెద్ది వరప్రసాద్ రెడ్డి సహకారంతో అన్నదానం చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుర మధు సుధాకర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వల్లి బాషా, మారం విష్ణు మోహన్, మనోహర్ రెడ్డి, రవికుమార్, మధు కుమార్, రోగులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో బేతంచెర్ల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం కరాటే మాస్టర్ వెంకటేశ్, కోచ్ నాగన్న అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలి యూనిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఫస్ట్ ఇంటర్ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన తొమ్మిది మంది చిన్నారులు అమృత, శ్రీవల్లిరెడ్డి,దివ్యశ్రీ, పూర్ణేంద్ర గోల్డ్‌మెడల్స్, ప్రశాం తి వల్లి, ఉత్తేజ్ ఉమార్ సిల్వర్, యశ్వంత్, రిత్విక్‌సాయి, నీలకంఠమని,తేజరెడ్డి కాంస్య పతకాలు సాధించార న్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.

తవ్వారు.. వదిలేశారు..!

- నెల రోజులుగా ప్రజల అవస్థలు
- నేటికీ ప్రారంభం కాని కాలువ నిర్మాణం



కాలువల నిర్మాణానికి తవ్వేసిన రోడ్డు

డోన్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో నగర్‌లో ఓ వీధికి డ్రైనేజీలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ నెల క్రితం కాలువలు నిర్మించేందుకు ఇళ్ల ముందు పగులకొట్టి గుంతలు తవ్వారు. అనంతరం వాటిని నిర్మాణాలు వదిలేశారు. ఈ కాలువల కోసం ఇళ్ల ముందు మెట్లు, గోతులు తవ్వడంతో ఆ వీధిలోని ప్రజలు ఇళ్లలోకి, బయటకు వెళ్లేందుకు చాలా అవస్థలు పడుతున్నారు. ఆకాలనీలో ఇద్దరు వృద్ధులు కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వీధిలోని ప్రజలు డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు.



ఆటోనగర్‌లో కాలువల గుంతలు తీయడంలో తాడు పట్టుకుని దిగుతున్న స్థానిక మహిళ

త్వరగా పూర్తి చేయండి



ఆటోనగర్‌లో కాలువలు నిర్మించేందుకు నెలరోజుల క్రితం మెట్లు తీసేసి, గుంతలు తవ్వారు. ఇంత వరకు కాల్వలు నిర్మించకపోవడంతో ఇంట్లోకి వెళ్లాలంటే మోకాళ్ల ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా పూర్తిచేయాలి.

-వడ్డె పార్వతమ్మ, కాలనీవాసి

సారూ.. సైడ్ కాలువలు నిర్మించండి

- డ్రైనేజీ లేక శాంతినగర్ వాసుల ఇక్కట్లు
- భారీవర్షం కురిస్తే ఇళ్లల్లోకి చేరుతున్న నీరు



సైడ్ కాలువలు లేని శాంతినగర్‌లో వీధి



నూతనంగా వేసిన సీసీతో ఎత్తు పెరిగిన ప్రధాన రహదారి

కొలిమిగుండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో సీసీ రోడ్లు నిర్మించిన అధికారులు సైడు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో వర్షపు నీరు ఇళ్లల్లో నుంచి బయటకు వెళ్లని పరిస్థితి. ఇటీవల శాంతినగర్ ప్రధాన రహదారి శిథిలావస్థకు చేరుకోవడంతో కూటమి ప్రభుత్వం నూతన రోడ్డును ఏర్పాటుచేసింది. ప్రధాన రహదారి కాస్త ఎత్తు పెరగడంతో వీధుల్లో నీరు భారీ వర్షం కురిస్తే కాలనీలో నిలిచి మునిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. అధికారులు చర్యలు తీసుకొని త్వరగా డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు. శాంతినగర్ ఆర్టీసీ బస్టాండుకు అతి సమీపాన ఉండటం, అందుబాటులో నూతన ఇల్లు ఉండటం, కాలనీ ప్రశాంతంగా ఉండటంతో పలువురు ఉద్యోగులు, వివిధ వర్గాల వారు శాంతినగర్‌లో నివాసం ఉండటానికి ఎక్కువగా ఇష్టపడతారు. దీంతో శాంతినగర్ ఎప్పుడూ జనసంచారంతో, కొలిమిగుండ్లలో ప్రధాన నగర్‌గా ప్రసిద్ధి చెందింది. ఎంతో ప్రాధాన్యత కలిగిన శాంతినగర్ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాలని కోరుతున్నారు.

అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కోట్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు, వాటి అమలు, స్థితిగతులపై అధికారులతో చర్చించారు. సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓంప్రకాష్, ఆలా మోహన్ రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఏపీవో అబ్దుల్ షకూర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేలబిళం ఆలయ అభివృద్ధికి విరాళం

కొలిమిగుండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నేలబిళం ఆలయ అభివృద్ధి కోసం దాతలు రూ.1,00,116 విరాళం అందజేశారు. సోమవారం బందార్లపల్లెకి చెందిన కర్ణం వీరారెడ్డి, నారాయణమ్మ కుటుంబసభ్యులు నేలబిళం మల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం కమిటీ చైర్మన్ బాలవెంకటరెడ్డికి విరాళాన్ని అందించారు. వంటశాల, భక్తుల విశ్రాంతి షెడ్లు నిర్మించడానికి ఈ మొత్తాన్ని వెచ్చిస్తామని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అన్నయ్య, పెద్దరామిరెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వాయిదా

కొలిమిగుండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.చెన్నంపల్లెలో ఈనెల 29నుంచి 31వరకు జరగాల్సిన రామాలోరి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వాయిదా వేసినట్లు గ్రామపెద్దలు సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు గమనించాలని విజ్ఞప్తిచేశారు.

మహానాడును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మంత్రి

బనగానపల్లె, మే 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కడప జిల్లాలో మూడు రోజుల పాటు నిర్వహించే మహానాడు సభలను విజయవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని అన్ని గ్రామాల క్లస్టర్, యూనిట్, బూత్, మండల అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శులు మంగళవారం మాత్రమే హాజరు కావాలని కోరారు. మిగిలిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈనెల 28న బహిరంగ సభకు భారీగా తరలిరావాలన్నారు. ఇందుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహానాడుకు హాజరై విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

అంధకారంలో ప్రభుత్వ కార్యాలయాలు

- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన కంప్యూటర్లు, ఎలక్ట్రిక్ వస్తువులు



ఎమ్మార్సీలో కాలిపోయిన కంప్యూటర్లు

చాగలమర్రి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయాల్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కంప్యూటర్లు, ఎలక్ట్రిక్ వస్తువులు శనివారం రాత్రి కాలిపోయాయి. ఆదివారం సెలవు కావడంతో సోమవారం కార్యాలయానికి వచ్చి రెవెన్యూ సిబ్బంది తలుపులు తెరవగా కంప్యూటర్లు, విద్యుత్ బల్బులు వెలగలేదు. ఫ్యాన్లు తిరగలేదు. అంధకారం నెలకొంది. సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో సెల్‌ఫోన్‌ల ద్వారా విధులు నిర్వహించాల్సి వచ్చింది. అలాగే ఎమ్మార్సీ కార్యాలయంలో మూడు కంప్యూటర్లు కాలిపోయాయి. విద్యాశాఖకు సంబంధించిన డేటా ఉంటుందో లేదోనని ఆ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ ఏఈ రమణయ్య స్పందించి ఆయా కార్యాలయాలకు విద్యుత్ సరఫరా కల్పించేందుకు తగు చర్యలు తీసుకున్నారు.

30న ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

శిరివెళ్ల, మే 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో పునః నిర్మించిన ఎల్లమ్మ తల్లి, పోతురాజు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 28, 29 తేదీల్లో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 30న యంత్ర, విగ్రహ, కలశ ప్రతిష్ఠ, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు.

నిందితుడిని ఉరి తీయాలి: టీఆర్ఎస్ఎఫ్

చాగలమర్రి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని ఉరితీయాలని టీఆర్ఎస్ఎఫ్ నాయకులు జయరాజు, ఓబులేసు డిమాండ్ చేశారు. సోమవారం చాగలమర్రి గ్రామంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ కమిషనర్, మహిళా కమిషన్ స్పందించి నిందితుడికి ఉరి శిక్ష పడేలా చూడాలని కోరారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యార్థి సంఘ నాయకులు పవన్, బయన్న తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాల వద్దే సరుకుల పంపిణీ

చాగలమర్రి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ దుకాణాల వద్దనే రేషన్ పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తారన్నారు. కార్డుదారులు రేషన్ దుకాణం వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ అబ్దుల్‌సత్తార్ ఉన్నారు.

ప్రశాంతంగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

చాగలమర్రి, మే 26 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో 'పది' సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ శాస్త్రీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోషల్ పరీక్షకు 61 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 41మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డిపార్టుమెంటల్ అధికారి జయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12 మోడల్ పాఠశాలల ఎంపిక

చాగలమర్రి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా 12 మోడల్ పాఠశాలలను ఎంపిక చేసినట్లు ఎంఈవో అనూరాధ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ రానున్న విద్యాసంవత్సరంలో ముత్యాలపాడు, శెట్టివీడు, గొడిగనూరు, చింతలచెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి, చిన్నబోధనం, మద్దూరు, మల్లేవేముల, చాగలమర్రి ప్రధాన పాఠశాల, గుంతపాలెం గిరిజన కాలనీలోగల పాఠశాలలు మోడల్ పాఠశాలలుగా కేటాయించామన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు పాఠశాలలు కొనసాగుతాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను 1, 2 తరగతులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో విలీనం చేస్తారని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రుద్రవరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ వర ప్రసాద్ వివరాల ప్రకారం.. ఆరేళ్ల క్రితం శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లకు చెందిన జగదీశ్వరి(25)ను రుద్రవరం మండల కేంద్రానికి చెందిన నాగచంద్ర అనే యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నంద్యాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి రంగయ్య తన కూతురు కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైన్ షాపు పరిశీలన

బేతంచెర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో ఉన్న రమ్య వైన్ షాపును సోమవారం సోమవారం సీఐ వెంకటేశ్వరరావు పరిశీలించారు. షాపులో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సీఐ పరిశీలించారు. షాపు వెనుకాల రేకులకు వేసిన రంధ్రాన్ని, సీసీ ఫుటేజీ రికార్డును తీసుకున్నారు.

వారాంతపు సంతలో చిత్తడి



రుద్రవరం సంతలో చిత్తడిలోనే కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

రుద్రవరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం రుద్రవరం వారాంతపు సంత జరుగుతోంది. అయితే వర్షం కురువడంతో సంత చిత్తడిగా మారింది. సంతకు సుమారు 18గ్రామాల నుంచి ప్రజలు కూరగాయలు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు తరలి వస్తారు. వర్షం కురుస్తున్నా గొడుగులు చేతపట్టుకొని తరలివచ్చారు. సంతలో వర్షం నీరు నిల్వడంతో చిత్తడిగా మారింది. అరకొర సౌకర్యాలు ఉన్నాయని వ్యాపారులు, కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

ఉయ్యాలవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : తన పొలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన రైతు వెంకటస్వామి వేడుకున్నాడు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ అర్జీలు స్వీకరించారు. రైతు వెంక టస్వామి మాట్లాడుతూ సర్వే నెం.178/2, 180/1లో గల 53 సెం ట్ల భూమి ఆన్‌లైన్ కాలేదన్నారు. నాలుగేళ్లుగా ఆన్‌లైన్ చేయాలని తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పరిశీలించి వెంటనే ఆన్‌లైన్ చేయాలని కోరారు.

పండ్ల తోటల్లో నీరు నిల్వ ఉండరాదు

డోన్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని డోన్ ఉద్యానశాఖ అధికారి జి.కళ్యాణి సూచించారు. సోమవారం ఉద్యాన శాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ముందస్తు కురుస్తున్న వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా అరటి తోట రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం నీటిలో మొక్కలు మునిగితే కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు. అలాగే బొప్పాయి, చీని, టమోటా, ఉల్లిగడ్డ రైతులు కూడా జాగ్రత్తలు పాటిం చాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండండి

కోవెలకుంట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొత్తనీరు చేరి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల క్లస్టర్ వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలన్నారు.

డబుల్‌రోడ్డు పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రుద్రవరం, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండు వరుసల రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈనెల 24న 'ఆంధ్రజ్యోతి' 'గుంతలతో నరకయాతన' అనే శీర్షిక కథనాన్ని ప్రచురించింది. దాంతో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ప్రమాదాలు లేకుండా ఉండేందుకు తవ్విన గుం తలను పూడ్చడానికి మట్టిని వేయిస్తున్నారు. రోడ్డు లెవల్‌లైనా గుంతలు పూడిస్తే ప్రమాదాలు కొంత వరకు నివారించొచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు.

ఆలయ భూముల కౌలు వేలం వాయిదా

శిరివెళ్ల, మే 26(ఆంధ్రజ్యోతి): కోటపాడు గ్రూపు దేవాలయాల పరిధిలోని రెండు ఆలయాలకు చెందిన భూముల బహిరంగ కౌలు వేలాను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు కార్యనిర్వహణాధికారి రామాంజనేయ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గుండంపాడు, శిరివెళ్ల లోని భూములకు జూన్ 4న బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే బోయలకుంట్లలోని వివిధ ఆలయాలకు చెందిన భూములకు జూన్ 2న వేలం నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

శిరివెళ్ల, మే 26(ఆంధ్రజ్యోతి) : కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై యర్రగుంట్ల సమీపంలోని ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సర్వాయపల్లె గ్రామానికి చెందిన చిన్న ఓబులేసు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద ఘటనపై విచారణ చేపట్టినట్లు శిరివెళ్ల ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజావేదిక

చాగలమర్రి, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమాన్ని చేపట్టిందని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఏవో రంగనేతాజీ, ఏపీవో ఖాసీం, ఏపీఎం నాగమ్మ, ఏఈలు కొండారెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

డోన్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్ఐ ఇంతియాజ్ బాషా సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి మాదన్ననగర్ సమీపంలో నరసింహుడు, నిఖిల్ స్కూటీపై వెళ్తుండగా కంట్లో కారం కొట్టి నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై నిఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

డోన్ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని వైద్యాధికారి ఎం.గ్రేస్, యోగా శిక్షకులు సోని, ప్రతాప్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డోన్ సహకారంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

గిన్నిస్ బుక్‌లో స్థానంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాంచ్‌మేనేజర్ శ్రీనివాసులు

ఆళ్లగడ్డ, మే 26 (ఆంధ్రజ్యోతి): భారత జీవిత బీమా సంస్థలో పని చేస్తున్న ఏజెట్లు కేవలం ఒక్క రోజులో 5,88,107 పాల సీలను సేకరిం చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడంపై ఆళ్లగడ్డ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసు లు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. ఆళ్లగడ్డ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఆళ్లగడ్డ బ్రాంచ్ పరిపాలన అధికారి సుబ్బారెడ్డి బదిలీ కాగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఏఏవో మురళిధర్ రావు, అధికారులు, ఏజెంట్లు, సంఘ నాయకులు ఉన్నారు.